# 32. ఆదర్శ ప్రభువు

జీవితం అంటూ ఉన్నదెందుకు ? పీకలదాకా అనుభవించటానికే— అనేది హిజ్ హైనెస్, మహారాజా. సర్ భూపేంద్రసింహజీవారి సిద్ధాంతం. అందుకు తగినట్లే శ్రీవారి పాటియాలా సంస్థానం భాగ్యవంతమైనదీ ఉత్తర భారతంలోకెల్లా పెద్దదీనూ.

మహారాజావారి హితులూ, సన్నిహితులూ, ఆస్థానోద్యోగులూ, మంత్రులూ కూడా శ్రీవారికి తగినవారే. వారున్నూ ఎవరింట్లో కుక్క ప్రసవించినా, పిల్లి సమర్తాడినా ఆ సాకుతో దివ్యమైన విందులూ, వినోదాలూ ఏర్పాటుచేసి మహారాజావారిని సుఖపెట్టి తాము తృప్తిపడేవారు.

అవిగాక మహారాజావారికి ప్రత్యేకంగా పిట్టల్ని వేటాడేవారం, పిలుల్ని పట్టుకునే వారం, పులుల్ని వేటాడేవారం, అంతఃపుర సుందరాంగులను పర్యవేక్షించే పక్షం అంటూ అనేకానేక కార్యక్రమాలుండేవి.

కనుక ...

శ్రీవారికిగానీ, వారి ముఖ్యోద్యోగులకుగానీ సంస్థానపాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఏమాత్రం తీరికా ఓపికా ఉండేవికావు.

వేటలో మహారాజావారు సిద్ధహస్తులు. శ్రీవారి తూటా గురి తప్పనిది. వారి శునకశాలలో తర్ఫీదు పొందిన శునకరాజాలు కొన్ని వందలుండేవి. మహరాజావారు వేటకు వెళ్ళి ఆకాశంలో విహరించే పక్షిని గురి చూసి కాలిస్తే దెబ్బతిన్న ఆ పక్షి నేలమీద పడేలోగానే పరుగెత్తి దానిని

ఎగిరి నోటకరచి మహారాజావారి వద్దకు తీసుకువచ్చేలా ఆ శునక రాజాలు తర్ఫీదయి ఉన్నాయి.

ఇంకేం కావాలి? మహారాజావారి జీవితం మూడొందల కుక్కలూ, ఆరొందల పరివారం, అరవైమంది రాణులూ, పదముగ్గురు మహారాణులుగా, రోజొక క్షణంలా గడచిపోతోంది.

మహారాజావారి సెక్రటేరియట్ రోజూ ఉదయం 10 గంటలకే తెరచేవారు. పనులున్నవారూ, పిటీషన్లు పెట్టుకునేవారూ రోజూ వందల సంఖ్యలో వస్తుండేవారు. కానీ, ఎప్పుడు చూసినా ఆ సెక్రటేరియట్‌లో గుమాస్తాలూ, చిన్న ఉద్యోగులూ మాత్రమే ఉండేవారు తప్ప అసలు నిర్ణయాలు తీసుకునే పెద్దలెవరూ దర్శన మిచ్చేవారు గారు.

ఎందుకంటే సదరు పెద్దలందరూ మహారాజావారిని సేవించి సుఖపెట్టేందుకుగాను శ్రీవారివెంట వేటకో, విందుకో వెళ్ళి ఉండేవారు.

తత్ఫలితంగా సంస్థాన పాలనా వ్యవహారాలు స్తంభించి పోసాగాయి. ఖజానాలోకి వచ్చే ఆదాయం తరిగిపో సాగింది.

ఇదంతా చూసిన బ్రిటిష్ ప్రభుత్వం సర్ ఫ్రెడరిక్‌గాంట్లెట్ అనే అనుభవజ్ఞుడిని మహారాజావారికి ఆర్థిక మంత్రిగా నియమిస్తూ ఆర్డర్లు జారీ చేసింది.

తన సంస్థాన వ్యవహారాల్లో బ్రిటిష్‌వారి పెత్తనం ఏ రూపంలోనైనా ఉండటం మహారాజావారికి ఇష్టం లేదు.

కానీ,

సెక్రటేరియట్‌లో ఫైళ్ళు గుట్టలుగా పేరుకుపోతూ ఉన్నాయ్! ఖజానాలోకి వచ్చే ఆదాయం తరగిపోతోంది. పరిష్కరించాల్సిన కేసులు

ఎక్కువయి పోతున్నాయ్ ! కనుక బ్రిటీష్‌వారి ప్రమేయాన్ని బాహాటంగా కాదనగల ధైర్యం మహారాజావారికి లేకపోయింది.

ఫలితంగా మహారాజావారు తన అయిష్టాన్నీ మరో విధంగా ప్రకటించ సాగేరు.

ఓ సుప్రభాతాన సర్ ఫ్రెడరిక్ గాంట్లెట్ పాటియాలాలోదిగి రాజప్రాసాదానికేగి మహారాజావారి దర్శనార్థియై కబురు చేసేరు.

కానీ, అర్ధరాత్రిదాకా వేచిఉన్నా మహారాజావారి దర్శనంకాలేదు. కనీసం కబురు తీసుకెళ్ళిన పరిచారకుడు కూడా పత్తాలేడు.

ఈలోగా సదరు పెద్దమనిషికి అడగకుండానే అనేక రకాల ఖరీదయిన మద్యాలు అందజేయబడ్డాయ్ ! షడ్రసోపేతమైన విందు అక్కడికక్కడే ఏర్పాటు చేయబడింది. సకలమైన అతిధి మర్యాదలూ అక్కడికక్కడే జరుగసాగాయ్ ! అప్సరసల్లాంటి స్త్రీ సేవికలు ఆయన్ను సేవించ సాగేరు.

ఈ విధంగా వారంరోజులు గడిచిపోయాయి గానీ మహారాజావారి దర్శనం మాత్రం కాలేదు.

గాంట్లెట్ మహాశయుడికి తొలిదశలో మహారాజావారి నిర్లక్ష్య ధోరణి చూచి ఆయన్ని నమిలి మింగేయా లన్నంత కోపం వచ్చేది. కానీ, పాటియాలా సంస్థానాన్ని బ్రిటిష్ సింహంచేత మ్రింగింప చేయాల్సిన బృహత్కర్తవ్యం తన భుజస్కంధాలమీదే ఉండటాన ఆ కోపాన్ని తనే మ్రింగివేయ సాగేడు.

ఇదిలా సాగుతుండగా మరికొన్ని రోజులు గడిచేసరికి మహారాజావారి ఆతిధ్య సత్కార ప్రభావం గాంట్లెట్ మహాశయుడిపై పనిచేయనారంభించింది. రోజూ ఉదయమే రాజప్రాసాదానికి వేంచేయటం, వెళ్ళు

ఓ మూల పెట్టి అర్థరాత్రిదాకా సీసాతో సుఖించటం నిత్యకృత్య మయిపో యింది. తనలాంటి మరికొందర్ని ప్రోగుజేసి 'బ్రిడ్జి' లాంటి ఆటలుకూడా అక్కడే ప్రారంభించేడు గాంట్లెట్ మహాశయుడు.

ఇదంతా సరదాగానే ఉందిగానీ, రోజు రోజుకూ ఫైళ్ళు మాత్రం గుట్టలుగా పేరుకుపోతూ ఉన్నాయ్. అందుకని గాంట్లెట్ మహాశయుడో తెలివైన పద్ధతి కనిపెట్టేడు. రోజూ ఫైళ్ళు తీసుకుని రావటం, వాటిని మహారాజావారి తీర్పులకోసం. సంతకాలకోసం లోపలికి పంపి, తను మధు సేవలో మునిగిపోవటం ప్రారంభించేడు.

ఇలా నెలలు గడచిపోయేయి. గాంట్లెట్ పని ఖుషీగానే ఉందిగానీ, మహారాజావారి ప్రైవేట్ గదిమాత్రం కాలుపెట్టే సందుకూడా లేకుండా ఫైళ్ళతో నిండిపోయింది. అవి చూసినపుడల్లా మహారాజావారికి బ్రిటిష్ సింహమూ, బయట తన దర్శనం కోసం ఎదురుజూస్తున్న దాని తోక లాంటి ఆర్థిక మంత్రి గాంట్లెట్ మహాశయుడూ గుర్తుకొస్తుండేవారు.

అందు మీదట ఓ రోజున మహారాజావారు తన మంత్రుల్నీ, అత్యంత విశ్వాసపాత్రులైన మరికొందరు ఉద్యోగుల్నీ రహస్యంగా పిలి పించేరు. వారందరికీ ఆ ఫైళ్ళు అప్పగించి చదవమన్నారు. వారికందరికీ అక్కడి కక్కడే భోజనపానాది సకల సౌకర్యాలూ కల్పింపజేసేరు.

వారందరూ కలసి ఆ ఫైళ్ళ గుట్టలన్నింటిని చదివి వాటిసారాంశం మహారాజావారికి అప్పటి కప్పుడు నివేదించ నారంభించగా శ్రీవారు వాటిపై తనకు తోచిన విధంగా, అనుంగు మంత్రుల సలహాలపై తగు విధంగా ఆర్డర్లువేసి సంతకాలు చేయసాగేరు.

ఈ పద్ధతిలో వారం రోజుల్లో సదరు ఫైళ్ళ గుట్టలన్నీ పూర్తిగా పరిష్కారమై ఒక్కటికూడా మిగలకుండా పోయాయి.

ఆ విధంగా మహత్కార్యం మహాద్భుత రీతిలో పూర్తి చేశాక...

ఎనిమిదో రోజున సర్ ఫ్రెడరిక్ గాంట్లెట్ మహాశయుడు సగౌరవంగా మహారాజ సన్నిధికి కొనిపో బడ్డాడు. ఫైళ్ళగుట్టలమధ్య ఒంటరిగా ఉన్న మహారాజావారు సదరు పెద్దమనిషికి స్వాగతమిచ్చి ఓ గ్లాసుడు ఖరీదైన విస్కీని స్వహస్తాల్లో అందించేరు.

కానీ, గాంట్లెట్ మహాశయుడు "ఓ రాజాధిరాజా, గత ఆరునెలలుగా మీ దర్శనమే లేక నేనిలా ఎదురుతెన్నులు చూస్తూ గడుపుతూ వస్తున్నాను. నేను పంపించిన ఈ ఫైళ్ళన్నీ ఇలా గుట్టలుగా పేరుకుని మీ తీర్పులకోసం పడిఉన్నాయి. మీరువీటిని పరిష్కరించేదాకా నేను మీ ఆప్యాయతతో కూడిన ఈ ఆతిథ్యాన్ని అంగీకరించరాదని నియమం పెట్టుకున్నాను" అంటూ అడ్డుపుల్ల వేసేడు.

అందుకు మహారాజావారు "ఓరీ, అమాయకుడా" అన్నట్లో చిరునవ్వు నవ్వినారు.

"మరయితే నేనీ గదిలో రాత్రింబవళ్ళూ కూర్చుని ఏం చేస్తున్నానని తమరి ఉద్దేశ్యం, గాంట్లెట్ మహాశయా?" అని ఎదురుప్రశ్న వేసేరు.

వేసి...
కొన్ని ఫైళ్ళను సదరు ఆర్థిక మంత్రిగారి ముందుకు తోసేరు, చూడమన్నట్లుగా.

వాటినీ, వాటితోపాటు అక్కడి గుట్టలలోని మరికొన్ని ఫైళ్ళనూ పరిశీలనగా చూసేక గాంట్లెట్ గారికి తల తిరిగిపోయి తెల్లమొహం వేసేరు. ఆ తర్వాత ఏడుపు మొహం పెట్టేరు. మహారాజావారి శక్తి సామర్థ్యాలనూ, శ్రద్ధాసక్తులనూ అపార్థం చేసుకున్నానని చింతించి అనేకానేక క్షమాపణలు చెప్పుకున్నారు.

ఆ తర్వాత...

మహారాజావారు స్వహస్తాలతో అందించిన విస్కీని అందుకుని శ్రీవారి ఆయురారోగ్యాలను కోరుతూ ఒక్క గుక్కలో స్వాహా చేసేరు.

తదుపరి తన నివాసానికేగి అప్సరసల పరిష్వంగంలో సుఖంగా నిద్రించిలేచాక "పాటియాలా మహారాజా హిజ్ హైనెస్, సర్ భూపేంద్ర సింహజీవారు కష్టపడి పనిచేసే వ్యక్తి. రాత్రిం బవళ్ళు సంస్థాన వ్యవహారాలలోనే మునిగి ఉంటున్నారు. భారత సంస్థానాలలో మరి దేనికీ ఇంత సమర్థుడూ, ప్రతిభావంతుడూనైన ప్రభువు లేడని నా ధృఢాభిప్రాయము" అని వైస్రాయ్‌కి నివేదికను పంపించేడు.

అది తెలిసిన మహారాజావారు మందహాసం చేసేరు.

★